క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇంజాపూర్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఇంజాపూర్ గ్రామంతో పాటు అన్ని కాలనీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీఆర్‌ఎస్ సమావేశం నేడు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వెంకట నర్సింహ గార్డెన్స్‌లో ఈనెల 2న ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మున్సిపాలిటీ పరిధిలోని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

సీఐ వెంకటేశ్వర్లుకు సన్మానం


వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: సీఐగా బాధ్యతలు చేపట్టి మంగళవారం తొలిసారిగా కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిశీలనకు వచ్చిన వెంకటేశ్వర్లును స్థానిక గౌడ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హరిశంకర్‌గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, కార్య నిర్వాహక అధ్యక్షుడు గణేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సుమన్‌గౌడ్, ప్రచార కార్యదర్శి శ్రీశైలం గౌడ్, ఉపాధ్యక్షుడు యాదయ్యగౌడ్ ఉన్నారు.

మురుగు పరుగును ఆపండి


సూరజ్‌నగర్‌లో రోడ్డుపై మురుగు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో పలుచోట్ల డ్రైనేజీ పొంగి రోడ్లపై ప్రవహిస్తున్నా మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాగన్నగూడలోని సూరజ్‌నగర్ కాలనీలో రోడ్డుపైనే డ్రైనేజీ పొంగి ప్రవహిస్తుండటంతో అటునుంచే వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఫొటోగ్రాఫర్లను ఆదుకోవాలి

ఎంపీపీ కొప్పు సుకన్య


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లు

యాచారం: ప్రభుత్వం.. ఫొటోగ్రాఫర్లను ఆదుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. ఈనెల 8న ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఎంపీపీ కొప్పు సుకన్య, ఎంపీడీఓ విజయలక్ష్మీ తదితరులు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ... మొబైల్‌ఫోన్ల వల్ల నేడు ఫొటోగ్రాఫర్ల జీవనోపాధి కష్టతరంగా మారాయని అన్నారు. అలాగే మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ఎంపీపీ సమావేశమయ్యారు. జీపీ కార్మికుల సమ్మె నేపథ్యంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన పుల్లమ్మ (59) అనారోగ్యానికి గురై మృతిచెందింది. మంగళవారం మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, స్థానిక నాయకుడు లక్ష్మీనారాయణగౌడ్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీనివాస్‌యాదవ్ రూ.3000, లక్ష్మీనారాయణగౌడ్ రూ.1000 బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో శేఖర్, చెన్నయ్య, కృష్ణయ్య, వంశీ, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కడ్తాల్: మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎంపీపీ కమ్లీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో ఎంపీపీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు, ఎంపీపీ కమ్లీ భూమిపూజ చేశారు. అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నిర్మలాదేవి, ఉప సర్పంచ్ వినోద్, వార్డు సభ్యులు, నాయకులు కాశీనాథ్‌రెడ్డి, వెంకటయ్య, వెంకటేశ్, నర్సింహ, శ్రీను, మల్లేశ్, శ్రీను తదితరులు ఉన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యం

- సీజనల్ వ్యాధులతో జాగ్రత్త
- ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: వర్షాకాలం సీజన్‌లో పట్టణ ప్రజల ఆరోగ్యాలను కాపాడటానికి ప్రత్యేక చొరవ చూపుతున్నాం. ప్రతి రోజు కాలనీల్లో చెత్తచెదారం తొలగించి వచ్చిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలిస్తున్నాం. సీజనల్ వ్యాధులు డెంగీ, టైఫాయిడ్, వాంతులు, విరోచనాలు, ప్రజలు ఇబ్బందులు పెడుతున్న కళ్ల కలకల నుంచి ఎవరికి వారే రక్షించుకోవాలి. స్వీయ నియంత్రణ పాటించాలి. ఆరోగ్య శాఖ, మున్సిపాలిటీ సంయుక్తంగా కార్యచరణ చేపడుతున్నామని పట్టణ ప్రజలకు సకల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి 'సాక్షి' ఇంటర్వ్యూలో చెప్పారు.

ప్రశ్న: పారిశుద్ధ్య నిర్వహణకు మున్సిపాలిటీ తీసుకుంటున్న చర్యలేంటి?

జవాబు: ఆదిబట్ల మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులు ఉన్నాయి. వార్డుల వారిగా ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. రోడ్లపై చెత్త లేకుండా నిరంతరం పనిచేస్తున్నారు.

ప్రశ్న: మున్సిపాలిటీ జనాభా ఎంత, సిబ్బంది ఎంతమంది పనిచేస్తున్నారు?

జవాబు: ఆదిబట్ల మున్సిపాలిటీలో 85 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 15వేల జనాభా ఉంది. ప్రస్తుత లెక్కల ప్రకారం 20వేల మంది వరకు ఉన్నారు.

ప్రశ్న: దోమల నివారణ కోసం ఏం చేస్తున్నారు?

జవాబు: దోమల నివారణ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. యాంటీ లార్వా మందులు పిచికారీ చేస్తున్నాం.. దోమలు గుడ్లు పెట్టకుండా నిల్వ ఉన్న నీరును తొలగించాలి. పూల కుండీలు, బకెట్లు, టైర్లల్లో ఉన్న నీరు ఎప్పటికప్పుడు తీసివేయాలి. ఫాగింగ్ మందు పిచికారీ చేస్తున్నాం.

ప్రశ్న: రోజుకు ఎంత చెత్త సేకరిస్తున్నారు?

జవాబు: ఆదిబట్ల మున్సిపాలిటీలోని 15 వార్డుల్లో 5,958 ఇళ్లు ఉన్నాయి. 11చెత్త సేకరణ వాహనాలు ఉన్నాయి. వాటిలో ప్రతిరోజు ఇంటింటికి తిరిగి 10టన్నుల చెత్తను సేకరిస్తున్నాం. పుర ప్రజలు తడి చెత్త, పొడిచెత్త వేరువేరుగా వేయాలి. రోడ్ల మీదు ఇష్టం వచ్చినట్లు వేయకూడదు.

ప్రశ్న: మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యంగా ఉండటానికి ఏ చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: పారిశుద్ధ్య కార్మికులకు ఇటీవలె సబ్బులు, నూనెలు, పనులు చేసేటప్పుడు చేతులకు గ్లౌజులు, మాస్కులు, రెయిన్ కోట్‌లు అందించాం. వర్షంలో కూడా వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న: సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రజలకు మీరిచ్చే సందేశం?

జవాబు: నిత్యం వేడి ఆహారాన్నే తీసుకోవాలి. ముఖ్యంగా ఆకుకూరలు తినాలు. ఎవరికైన డెంగీ, మలేరియా లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే మున్సిపాలిటీ అధికారులకు తెలియజేయాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరాలి. ఆదిబట్ల మున్సిపాలిటీలో కొంగరకలాన్, ఆదిబట్లలో బస్తీ దవఖానాలు ఉన్నాయి. వాటిని ఉపయోగించుకోవాలి. అవసరమైతే ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తాం. పరిసరాల పరిశుభ్రత పాటించాలి.

చిరునామాలు సక్రమంగా రాయాలి

సౌత్ ఈస్టు డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ టీపీవీ శర్మ


సమావేశంలో మాట్లాడుతున్న శర్మ

మంచాల: ఉత్తరాలపై సరైన చిరునామాలు రాయాలని హైదరాబాద్ సౌత్ ఈస్టు డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ టీపీవీ శర్మ అన్నారు. మంగళవారం మంచాల పోస్టాఫీస్‌ను ఆయన సందర్శించారు. అనంతరం నిర్వహించిన మండల పోస్టుమాన్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చాలామంది ఉత్తరాల్లో సరైన చిరునామాలు రాయడం లేదన్నారు. కొంతమంది పిన్‌కోడ్ నంబర్లు కూడా సక్రమంగా రాయడం లేదన్నారు. దీంతో ఉత్తరాలు పంపించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఖచ్చితమైన చిరునామాలు వ్రాయాలన్నారు. అవతలి వ్యక్తి, సంస్థ ఫోను నంబర్లు రాయాలని తెలిపారు. చిరునామాలు తప్పు రాసినప్పటికీ ఫోను నంబర్ ద్వారా వివరాలు తెలుసుకొని తొందరగా ఉత్తరాలు చేరవేయడానికి అవకాశం ఉంటుందన్నారు. బ్యాంకుల్లో ఇచ్చే చిరునామాలు, ఆధార్ కార్డు పై ఉండే చిరునామాలు సక్రమంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. చాలా మంది చిన్న, చిన్న పొరపాట్లు చేయడం వల్లన నిర్ణీత సమయంలో ఉత్తరాలు చేరవేయలేకపోతున్నామని తెలిపారు. అదేవిధంగా పోస్టాఫీస్ ద్వారా అందించే పథకాల గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో సౌత్ సబ్ డివిజన్ మెయిల్ ఓవర్సీ రాజు, మంచాల బ్రాంచ్ బీపీఎం ప్రవీణ్‌కుమార్, మంచాల గ్రామ పంచాయతీ కోఆప్షన్ సభ్యుడు బాలరాజ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.లక్ష అందజేత


ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ కాశీవిశ్వనాథ్‌కు నగదు అందజేస్తున్న నాయకులు

మంచాల: మండల పరిధిలోని బండలేమూర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానిక నాయకులు పోలీసు శాఖలో పనిచేసే ఉద్యోగులు కలిసి మంగళవారం సీఐ కాశీవిశ్వనాథ్‌ను కలిసి రూ.లక్ష అందజేశారు. అనంతరం ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్ రావు, సీఐని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంగ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణలో భాగంగా పోలీసు శాఖ సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గ్రామాభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణలో ఇవి ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. బండలేమూర్ గ్రామస్తులు, పోలీసు శాఖ ఉద్యోగుల సహకారంతో బుధవారం కెమెరాలు బిగించనున్నట్లు స్పష్టంచేశారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

వైస్ ఎంపీపీ అనంతరెడ్డి


ఆమనగల్లు: సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున వైస్ ఎంపీపీ అనంతరెడ్డి

ఆమనగల్లు: ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు మండల వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి కోరారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామానికి చెందిన వరికుప్పల శ్రీశైలంకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.26వేలు మంజూరయ్యాయి. మంగళపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శ్రీశైలంకు అందజేశారు. మండల టీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి శంకర్, నాయకులు మురళి, వెంకటేశ్, నర్సింహా, యాదయ్య, తానయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలిపల్లికి చెందిన కవితకు రూ.13500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. మంగళవారం చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు రేణురెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, శరత్‌చంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

కాంగ్రెస్ నేత ఈసీ శేఖర్‌గౌడ్

మంచాల: మండలంలోని అర్హులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు తక్షణమే ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మంచాల మండలంలోని లింగంపల్లి గేట్‌వద్ద నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను సందర్శించడానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈసీ శేఖర్‌గౌడ్ రావడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఏసీపీ శ్రీనివాస్‌రావు ఎట్టి పరిస్థితిలో అనుమతి లేదని తెలపడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని గత నాలుగేళ్లుగా నాన్చుతుందన్నారు. అర్హులకు ఇవ్వకుండా రాజకీయ లబ్ధి కోసం అధికార పార్టీ నేతలు వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఎన్నికల వేళ డబుల్‌బెడ్ రూం ఇళ్ల పేరుతో ఓట్లు దండుకునే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. మంచాల మండలంలో అర్హులైన పేదలకు తక్షణమే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో ఇవ్వకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరోసారి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి కృష్ణ, తమ్మళ్ల కృష్ణ, ఉడుగుల శివ, మురళి, సత్యం శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

జెడ్పీటీసీ సభ్యురాలు నిత్యారెడ్డి


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నిత్య

మంచాల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ముందుకు పోవాలని మంచాల జెడ్పీటీసీ సభ్యురాలు మర్రి నిత్య నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆరుట్లలో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంగళవారం ఆమె ప్రారంభించారు. మనోవికాస సంకల్ప కేంద్రం, ప్రహరీ నిర్మాణం కోసం రూ.2.32 లక్షల ప్రొసీడింగ్‌ను స్థానిక సర్పంచ్ అనిరెడ్డి జగన్‌రెడ్డికి అందజేశారు. అనంతరం దాద్‌పల్లిలోని మహిళా వికాస కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. పాఠశాల, అంగన్ వాడీ కేంద్రాలను సందర్శించి, సమస్యలను తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, పాండాల జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

3నుంచి పశువులకు టీకాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఈనెల 3వ తేదీ నుంచి 31వ తేదీ వర కు పశువులకు గాలికుంటు నివారణ టీకాలతో పాటు, లంపి స్కిన్ జబ్బుల నివారణ మందు లు వేయనున్నట్లు పశువైద్యాధికారి శంకర్ మ ంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పశువులకు టీకాలు వేయించాలని కోరారు.

టీకాలు వేయించాలి..

మంచాల: గ్రామాల్లో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పక వేయించాలని మంచాల మండల పశు వైద్యాధికారి డాక్టర్ సుధారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆగాపల్లి గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆగాపల్లి సర్పంచ్ జంగయ్య, సిబ్బంది రాంచందర్, శ్రీశైలం, శివరాజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కథనభేరికి తరలిన నాయకులు

ఆమనగల్లు: సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ విద్యార్థి కథనభేరి సభకు ఆమనగల్లు పట్టణం నుంచి ఏబీవీపీ నాయకులు తరలివెళ్లారు. ఆమనగల్లు పట్టణంలో ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో కథనభేరి సభకు తరలివెళ్లారు. ఏబీవీపీ నాయకులు గోరటి భరత్, మల్లేశ్, సురేశ్, సాయి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌నుంచి..

కడ్తాల్: సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మంగళవారం నిర్వహించిన ఏబీవీపీ కదనభేరి బహిరంగ సభకు మండల కేంద్రం నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు క్యామ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. నగర కార్యదర్శి నేనావత్ శ్రీకాంత్, నాయకులు పవన్, శ్రీకాంత్, ఉమేశ్, మహేశ్, వేణు, సంజయ్, రాఘవేందర్, సందీప్ ఉన్నారు.

సత్యనారాయణ స్వామి వ్రతం

ఇబ్రహీంపట్నం: అధిక శ్రావణమాస పౌర్ణమిని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కొన కట్ట వద్ద గల హరివర అఖండ క్షేత్రం వద్ద మంగళవారం సమూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ వ్రతాలను చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, బీజేపీ నాయకులు ప్రతాప్, లచ్చిరెడ్డి, లారీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నందారెడ్డి, అఖండ ట్రస్ట్ అధ్యక్షులు వెంకట్, ఇన్‌చార్జి చందు తదితరులు పాల్గొన్నారు.

హరితహారం మొక్కల పంపిణీ

కడ్తాల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, సర్పంచ్ హంశ్య మోత్యానాయక్ అన్నారు. మండల పరిధిలోని గానుగుమార్లతండా గ్రామ పంచాయతీలో హరితాహారంలో భాగంగా మంగళవారం ప్రతి ఇంటికి 5 మొక్కల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు అండగా కేసీఆర్ ప్రభుత్వం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: కేసీఆర్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మైనింగ్ జోన్‌లో భూములు కోల్పోయిన అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని బండ రావిర్యాల, చిన్నరావిర్యాల గ్రామాల రైతులకు నష్ట పరిహారం ఇప్పించిన సందర్భంగా పలువురు రైతులు మంగళవారం ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 268 సర్వేనంబర్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా రైతులు భూములను మైనింగ్ జోన్‌కు కేటాయించింది. ఎమ్మెల్యే తనయుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఇటీవల చేసిన ప్రగతి నివేదన పాదయాత్రలో ఈ విషయాన్ని బాధిత రైతులు అయన దృష్టికి తీసుకురాగా పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఎకరానికి 7,40 లక్షల నష్టపరిహారం మంజూరు చేయించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మరో 159 మంది బాధిత రైతులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానన్నారు.


ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో రైతులు

డబుల్ రోడ్డుకు నిధుల మంజూరుపై హర్షం

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం


సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కడ్తాల్: కడ్తాల్ నుంచి వంపుగూడ, చల్లంపల్లి, సాలార్‌పూర్ గ్రామాల మీదుగా పడకల్ గేట్ వరకు డబుల్ రోడ్డు ఏర్పాటుకు రూ.18.90 కోట్లు మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చిత్రపటాలకు జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కృషితో నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో కడ్తాల్, తలకొండపల్లి మండలాల ప్రజానీకానికి, రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని అన్నారు. కడ్తాల్ వయా చల్లంపల్లి–పడకల్ రోడ్డుకు నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు, కృషి చేసిన ఎమ్మెల్యేకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణయ్య యాదవ్, ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, ప్రియా రమేశ్, ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, జైపాల్‌రెడ్డి, శారద, నాయకులు రాజేందర్‌యాదవ్, లాయక్‌అలీ, సేవ్యా, భిక్షపతి, రాంచంద్రి, శ్రీను, అంజి, పాండు, రమేశ్, వెంకటేశ్, జగన్ టిక్‌లాల్ తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్‌ది దోపిడీ రాజ్యం

- మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- పంచాయతీ కార్మికులకు సంఘీభావం


పంచాయతీ సిబ్బంది సమ్మెకు మద్దతుగా మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి

యాచారం: కేసీఆర్ పాలన దోపిడీ రాజ్యంగా మారిందని, పేదవారు బతికే పరిస్థితి లేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మండిపడ్డారు. మండల కేంద్రంలో పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మెకు మంగళవారం ఆయన మద్దతు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని దోచుకుంటున్న కేసీఆర్‌కు పంచాయతీ సిబ్బంది సమ్మె కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారినా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఏం చేస్తున్నట్లు నిలదీశారు. పంచాయతీ సిబ్బంది చేసే సమ్మెలో నిజాయితీ ఉందన్నారు. వీరి ఆందోళనతో గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్మికులకు రూ.20 వేలకు తగ్గకుండా జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మంకాల దాసు, అమృతాసాగర్, మస్కు నర్సింహ, సీపీఎం నాయకులు ఆలంపల్లి నర్సింహ, పి. అంజయ్య, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంచం కృష్ణమూర్తికి నివాళి


మంచాల: కృష్ణమూర్తి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కాంచం కృష్ణమూర్తి వర్ధంతిని ఇబ్రహీంపట్నం పాషానరహరి స్మారక కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం రైతాంగ సాయుధ పోరాటాన్ని నడిపించిన మహాయోధుడు కృష్ణమూర్తి అని నాయకులు కొనియాడారు. సీపీఎం నాయకులు సామేల్, జంగయ్య, గణేశ్, భాస్కర్, ఎల్లేష్, జగన్, బుగ్గ రాములు, వెంకటేశ్, రమేష్ పాల్గొన్నారు.

మంచాలలో...

మంచాల: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కాచం కృష్ణ మూర్తి త్యాగం మరువలేనిదని సీపీఎం జిల్లా నాయకుడు యాదయ్య అన్నారు. మంగళవారం మంచాల మండల కేంద్రంలో నిర్వహించిన కాంచం కృష్ణమూర్తి వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కృష్ణ మూర్తి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి శ్యాంసుందర్, నాయకులు జంగయ్య, రాజు, స్వామి, రజాక్ పాష, యాదగిరి, నర్సింహ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

యాచారం మండల కేంద్రంలో..

యాచారం: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, కామ్రేడ్ కాచం కృష్ణమూర్తి వర్ధంతిని మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళుర్పించారు. ప్రజా సంఘాల నాయకులు నర్సింహ, అంజయ్య, అరుణ, జంగయ్య, జగన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంబురాలు

- ప్రభుత్వంలో విలీనంపై హర్షం
- సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం


ఇబ్రహీంపట్నం: సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, కార్మికులు

ఇబ్రహీంపట్నం: టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం పట్ల ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఇబ్రహీంపట్నం డిపో ఆర్టీసీ కార్మికులతో కలిసి మంగళవారం సంబురాలు నిర్వహించారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులను, సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వేలాది మంది ఆర్టీసీ సిబ్బంది జీవితాల్లో వెలుగు నింపిందన్నారు. ఉద్యోగులకు ప్రభుత్వ అండదండలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు సుధాకర్, బీఆర్‌ఎస్ నాయకుడు రవీందర్, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో

హయత్‌నగర్: ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంపై మంగళవారం హయత్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ కార్మికులు కేసీఆర్ చిత్రపటానికి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ... ఆర్టీసీ చరిత్రలో ఇది ఎంతో సుదినం అని.. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలనేది కార్మికుల చిరకాల కోరిక అని అన్నారు. కార్మికులు మరింతగా కష్టపడి ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు ఇది ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ మేనేజర్‌లు కృష్ణయ్య, విజయకుమారి సిబ్బంది షాలిని, రమణ, మహిపాల్‌రెడ్డి నెహ్రూ నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీఎంయూ నేతల సంబురాలు..

ఆమనగల్లు: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్టీసీ ఉద్యోగుల పక్షపాతి అని మిథాని ఆర్టీసీ డిపో టీఎంయూ నాయకులు ఉడతల వెంకటయ్య, ఎండీ.మజీద్, రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం హర్షదాయకమని వారు అన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం వారు మాట్లాడుతూ.. టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేవిధంగా సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని అన్నారు.

చారిత్రాత్మకమైన నిర్ణయం..

తలకొండపల్లి: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైందని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రేణురెడ్డి అన్నారు. మంగళవారం గట్టుఇప్పలపల్లిలో ఆయన మాట్లాడారు. ఈ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా 42వేల మంది ఆర్టీసీ కార్మికులకు మేలు జరుగుతుందని అన్నారు.

కార్మికులకు మంచిరోజులు..

తుర్కయంజాల్: ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయం అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. ఎన్నో ఏళ్లుగా కార్మికులు చేస్తున్న పోరాట ఫలితమే ఈ విలీనమని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారని.. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో వీరికి మంచి రోజులు రానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.